క్లుప్తంగా

పశువైద్య శిబిరం



నిజామాబాద్ సిటీ: నిజామాబాద్ రూరల్ మండలం శ్రీనగర్‌లో బుధవారం పశుసంవర్ధక శాఖ ఆధ్వర్యంలో పశువులకు గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించారు. ఈ శిబిరంలో 47 పశువులకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేసినట్లు జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి జగన్నాథ చారి తెలిపారు. అనంతరం పాడి రైతులకు జిల్లా అధికారి పలు సూచనలు, సలహాలు ఇచ్చి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సహాయ సంచాలకులు డాక్టర్ బాలిక్ అహ్మద్, శ్రీనగర్ గ్రామ సర్పంచ్ సురేందర్, మండల పశు వైద్య అధికారి ప్రమోద్ కుమార్ పాల్గొన్నారు.

అంత్యక్రియలకు ఆర్థిక సహాయం



నిజామాబాద్‌నాగారం: ఆర్మూర్ మండలం ఫతేపూర్ గ్రామానికి చెందిన కూలి పని చేసుకునే వేముల సునీల్ గడ్డి మందు తాగి మంగళవారం ప్రభుత్వ ఆసుపత్రిలో మృతిచెందాడు. అంత్యక్రియల కోసం కుటుంబ సభ్యులు శ్రీలక్ష్మీచేయూత సేవా సమితిని ఆర్థిక సహాయం అందించాలని కోరగా బుధవారం రూ.5 వేలను సునీల్ బావమరిది ఈశ్వర్ ప్రసాద్ ద్వారా పంపించారు. సేవా సమితి అధ్యక్షులు వంగల రమణాచారి, లక్ష్మణ్, బాలరాజు, సీహెచ్. భూషణ్‌చారి, తదితరులున్నారు.

పోస్టల్‌లో పెరిగిన వడ్డీ రేట్లు

సిరికొండ: తపాలా శాఖలోని అన్ని పథకాలపై వడ్డీ రేట్లు భారీగా పెరిగాయని నిజామాబాద్ సౌత్ పోస్టల్ ఇన్‌స్పెక్టర్ సంతోష్ కుమార్ తెలిపారు. సేవింగ్స్ అకౌంట్లపై 4 శాతం, రికరింగ్ డిపాజిట్ అకౌంట్‌పై 5.8 శాతం, టైం డిపాజిట్ అకౌంట్‌పై సంవత్సరానికి 6.6 శాతం, రెండు సంవత్సరాలకు 6.8 శాతం, మూడు సంవత్సరాలకు 6.9 శాతం, 5 సంవత్సరాలకు 7 శాతం, మంత్లీ ఇన్‌కం స్కీం అకౌంట్లపై 7.1 శాతం, నేషనల్ సేవింగ్స్ సర్టిఫికెట్‌కు 7 శాతం, కిసాన్ వికాస పత్రంపై 7.2 శాతం, సీనియర్ సిటిజన్ అకౌంట్‌పై 8 శాతం, సుకన్య సమృద్ధి అకౌంట్‌పై 7.1 శాతం వడ్డీ లభిస్తుందన్నారు.

ప్రభుత్వ ప్లీడర్లుగా శ్రీహరి, ప్రదీప్



ఖలీల్‌వాడి: నిజామాబాద్ జిల్లా కోర్టులో ప్రభుత్వ న్యాయవాది, సహాయ న్యాయవాదులను నియమిస్తూ తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ కార్యదర్శి నందికొండ నర్సింగ్ రావు ఉత్తర్వులు జారీచేశారు. ప్రిన్సిపల్ డిస్ట్రిక్ అండ్ సెషన్స్ కోర్టులో ప్రభుత్వ న్యాయవాదిగా శ్రీహరి ఆచార్య, ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ కోర్టు సహాయ ప్రభుత్వ న్యాయవాదిగా యెండల ప్రదీప్‌లు నియమితులయ్యారు. జిల్లా కోర్టులలో జిల్లా అధికార యంత్రాంగం తరపున వారు కోర్టులో సివిల్ న్యాయవ్యవహారాలను అధికారికంగా నిర్వహిస్తారు. వీరి పదవీ కాలం మూడేళ్ల పాటు కొనసాగుతుంది. ప్రభుత్వ ప్లీడర్‌లుగా నియమితులైన శ్రీహరి ఆచార్య, ప్రదీప్‌లు జిల్లా జడ్జి సునీత కుంచాలను మర్యాదపూర్వకంగా కలిశారు. వీరి ఎంపికైనందుకు బార్ అధ్యక్షుడు ఎర్రం గణపతి, బార్ కౌన్సిల్ సభ్యుడు మంథని రాజేందర్ రెడ్డి, పలువురు న్యాయవాదులు అభినందనలు తెలిపారు. మా నియామకాలకు సహాయ, సహకారాలు అందించిన మంత్రి ప్రశాంత్ రెడ్డి, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, ఎమ్మెల్యే బిగాల గణేష్ గుప్తాకు శ్రీహరి, ప్రదీప్‌లు కతజ్ఞతలు తెలిపారు.

మాదకద్రవ్యాలపై అవగాహన



ఎడపల్లి(బోధన్): మహిళా శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో బుధవారం పిల్లల్లో మాదకద్రవ్యాల దుర్వినియోగం, అక్రమ రవాణాపై జానకంపేట పోలీస్ ట్రైనింగ్ సెంటర్‌లో పదవ తరగతి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ముఖ్య అతిథిగా జిల్లా మానసిక ఆరోగ్య అధికారి రవితేజ పాల్గొని మాట్లాడారు. పొగాకు, గంజాయి, ఆల్కహాల్ తదితర మత్తు పదార్థాలు వాడడం వల్ల మానసిక సమతౌల్యం దెబ్బతింటుందన్నారు. విశిష్ట అతిథి జువైనల్ జస్టిస్ బోర్డ్ సభ్యులు రమణ మాట్లాడుతూ.. పిల్లలు మొబైల్స్ వాడడం తక్కువ చేసి ఆటలు ఆడటం ఎక్కువ చేయాలని కోరారు. జిల్లా బాలల పరిరక్షణ అధి కారి చైతన్యకుమార్, బాల రక్షభవన్ కో–ఆర్డినేటర్ విజయలక్ష్మి, ఎక్సైజ్ ఎస్సై బాలయ్య, ఎస్సై పురుషోత్తం పాల్గొన్నారు.

అంధత్వ రహిత సమాజమే లక్ష్యం

- నగర మేయర్ నీతూకిరణ్
- కంటి వెలుగు శిబిరం పరిశీలన



కంటివెలుగు శిబిరాన్ని పరిశీలిస్తున్న నగర మేయర్ నీతూకిరణ్

నిజామాబాద్‌నాగారం: అంధత్వ రహిత సమాజమే లక్ష్యంగా కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారని నగర మేయర్ నీతూకిరణ్ అన్నారు. బుధవారం నగరంలోని 19వ డివిజన్ గంగస్థాన్‌లోని కమ్యూనిటీ హాల్‌లో కంటి వెలుగు శిబిరాన్ని మేయర్ సందర్శించారు. కంటి పరీక్షలు చేయించుకున్నారు. మేయర్ మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ ప్రజలందరి జీవితాలలో వెలుగులు చూడాలనే ధ్యేయంతో కంటి వెలుగు కార్యక్రమం చేపట్టారన్నారు. కంటి సమస్యను పెద్దగా పట్టించుకోరని గ్రహించి రాష్ట్రంలోని 18 ఏళ్ల పైబడిన ప్రతి ఒక్కరికి కంటి పరీక్షలు నిర్వహించటం చాలా శుభపరిణామనని అన్నారు. నగరంలో 13 సెంటర్లలో కంటి వెలుగు కార్యక్రమం కొనసాగుతుందని, ప్రజల స్పందనను తెలుసుకోవటానికి వచ్చినట్లు తెలిపారు. కంటి పరీక్షల కోసం వచ్చిన ప్రజలతో మాట్లాడి సమస్యలను తెలుసుకున్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్‌వో సుదర్శన్, వైద్యాధికారులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా



భూమిపూజ చేస్తున్న మేయర్

నిజామాబాద్‌నాగారం: ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా కృషి చేస్తానని మేయర్ నీతూ కిరణ్ అన్నారు. బుధవారం నగరంలోని 34వ డివిజన్ కుమార్‌గల్లీలో రూ. 20 లక్షల నిధులతో చేపట్టే సీసీ రోడ్డు, సీసీ డ్రైనేజీ పనులను స్థానిక కార్పొరేటర్ కల్పన మల్లేష్‌తో కలిసి భూమిపూజ చేసి ప్రారంభించారు. మేయర్ మాట్లాడుతూ.. ప్రజల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా అంతర్గత డ్రైనేజీ, రోడ్ల నిర్మాణానికి ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న కాలనీవాసులు

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి)లోగల శ్రామికనగర్‌లో సమస్యలు పరిష్కరించాలని కాలనీవాసులు బుధవారం ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్‌ను ఆయన నివాసంలో కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కాలనీవాసులు మాట్లాడుతూ .. 20 ఏళ్లుగా కాలనీలో డ్రెయినేజీ నిర్మాణం చేపట్టలేదన్నారు. ఇళ్లల్లో వాడుతున్న నీరు రోడ్లపై వస్తున్నాయని, ఇళ్లల్లో స్త్రీలకు మరుగుదొడ్లు లేక అనేక అవమానాలు ఎదుర్కొంటున్నారని వివరించారు. ప్రభుత్వం పట్టాలిచ్చిన తర్వాత కట్టుకున్న ఇళ్లకు ఇప్పటివరకూ ఆన్‌లైన్‌లో నమోదు చేయడం లేదని, నేటికీ ఓపెన్ ప్లాట్లుగానే చూపిస్తోందన్నారు. స్థానిక కార్పొరేటర్‌కు పలుమార్లు విన్నవించినా పరిష్కారం కావడంలేదని అన్నారు. మరుగుదొడ్లు నిర్మించుకోవడానికి రుణం ఇప్పించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన ఆయన త్వరలోనే సమస్యల పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచ్చారు.

ఆధ్యాత్మికం

ఘనంగా వేంకటేశ్వర స్వామి కల్యాణం



జక్రాన్‌పల్లి: పడకల్‌లో భూనీలా సమేత బంగారు లక్ష్మీ వేంకటేశ్వర స్వామి కల్యాణోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. గ్రామంలో డప్పు వాయిద్యాలతో మంగళహారతులతో స్వామి వారి ఊరేగింపు చేశారు. అనంతరం ఆలయంలో వేద పండితుడు మహేంద్ర సిద్ధాంతి ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం నిర్వహించారు. కల్యాణ మహోత్సవానికి మహిళలు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. గ్రామాభివృద్ధి కమిటీ, ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఉత్సవాలతో పాటు అన్నదానం చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ పుప్పాల శ్రీనివాస్, ఎంపీటీసీ సభ్యుడు గంగారెడ్డి, ఉప సర్పంచ్ రిత్విక్, గ్రామ కమిటీ అధ్యక్షుడు నితిన్‌రెడ్డి, ఉపాధ్యక్షుడు పసుల రవి, ఆలయ కమిటీ సభ్యులు రవిగౌడ్, నర్సారెడ్డి, చందు పాల్గొన్నారు.

వైభవంగా హరిహర క్షేత్ర దశమ వార్షికోత్సవం

డిచ్‌పల్లి: మండలంలో ప్రసిద్ధి చెందిన బర్ధిపూర్ గ్రామంలోని శ్రీహరిహర క్షేత్ర ఆలయ దశమ వార్షికోత్సవాలు వైభవంగా కొనసాగుతున్నాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం ఉదయం పలు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని శ్రీహరిహరులను సేవించుకున్నట్లు ఆలయ కమిటీ నిర్వాహకులు తెలిపారు.

నేడు కల్యాణ మహోత్సవం

వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం 10.30 గంటలకు శ్రీహరిహరులకు 'కల్యాణ మహోత్సవం' నిర్వహిస్తారని ఆలయ అర్చకులు రాహుల్ తెలిపారు. మధ్యాహ్నం ఒంటి గంటకు భక్తులకు అన్నదానం నిర్వహిస్తారని తెలిపారు. స్వామి వారి కల్యాణంలో పాల్గొనే భక్తులు గోత్రనామాలతో తమ పేర్లను నమోదు చేసుకోవాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

జాతీయ స్థాయిలో ప్రతిభ చూపాలి



శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న శోభన్‌బాబు

- రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్‌బాబు
- మహిళల జట్టు శిక్షణ శిబిరం ప్రారంభం



క్రీడాకారిణులతో సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ రాష్ట్ర, జిల్లా ప్రతినిధులు

డిచ్‌పల్లి: పది రోజుల పాటు జరిగే శిక్షణ శిబిరంలో ట్రైనర్స్ నేర్పించే నూతన మెలకువలను చక్కగా నేర్చుకుని జాతీయ స్థాయి పోటీల్లో ఉత్తమ ప్రతిభ చూపాలని రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి శోభన్‌బాబు సూచించారు. సుద్దపల్లి సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల/కళాశాల క్రీడా మైదానంలో బుధవారం రాష్ట్ర సీనియర్ మహిళల సాఫ్ట్‌బాల్ ప్రాబబుల్స్ జట్టుకు నిర్వహిస్తున్న శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శిక్షణ శిబిరంలో ప్రతిభ చూపిన వారిని తుది జట్టుకు ఎంపిక చేస్తారని తెలిపారు. రాష్ట్ర జట్టుకు ఎంపికైన క్రీడాకారులు వచ్చే నెల 5 నుంచి 9 వరకు ఒడిశాలో జరిగే జాతీయ సీనియర్ సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఈ పోటీల్లో రాష్ట్ర జట్టును ప్రథమ స్థానంలో నిలపాలని ఆయన ఆకాంక్షించారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగ నోటిఫికేషన్‌లో 2 శాతం క్రీడా రిజర్వేషన్ కల్పించడం సంతోషకరమైన విషయమని అన్నారు. కళాశాల ప్రిన్సిపల్ గోదావరి, రాష్ట్ర సాఫ్ట్‌బాల్ అసోసియేషన్ కోశాధికారి అభిషేక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

బీడీ కార్మికులకు జీవనభృతి ఇవ్వాలి



ఇందల్వాయిలో ధర్నా చేస్తున్న కార్మికులు

ఇందల్వాయి: తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్(ఐఎఫ్‌టీయూ) ఆధ్వర్యంలో ప్రతి బీడీ కార్మికురాలికి రూ.2016 జీవనభృతిని ఇవ్వాలని బుధవారం ఇందల్వాయి ఎంపీడీవో కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. అనంతరం వినతిపత్రం అందజేశారు. ఐఎఫ్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి వెంకన్న మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ 2014 అసెంబ్లీ ఎన్నికల్లో ప్రతి బీడీ కార్మికురాలికి రూ.1000 జీవనభృతి ఇస్తానని హామీ ఇచ్చి మర్చిపోయారన్నారు. 2019 ఎన్నికల్లో ప్రతి బీడీ కార్మికురాలికి రూ.2016 రూపాయల జీవనభృతిని ఇస్తామని హామీ ఇచ్చి 28/02/2014 కటాఫ్ తేదీని పెట్టడం వలన బీడీ కార్మికులకు అన్యాయం జరిగిందన్నారు. జీవనభృతి ఇవ్వని పక్షంలో బీడీ కార్మికులతో పెద్ద ఎత్తున ఉద్యమిస్తామని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. యూనియన్ ఏరియా కార్యదర్శి కిషన్, రమేశ్, ఐఎఫ్‌టీయూ జిల్లా నాయకులు మురళి, ఏఐపీకెఎంఎస్ నేత సాయగౌడ్ ఉన్నారు.

అర్హులకు 'డబుల్' ఇళ్లు నిర్మించి ఇవ్వండి



నిరసన తెలుపుతున్న ప్రజాపంథా నాయకులు

డిచ్‌పల్లి: ఇళ్లు లేని అర్హులకు ప్రభుత్వం వెంటనే డబుల్ బెడ్‌రూం ఇళ్లు నిర్మించి ఇవ్వాలని అఖిల భారత ప్రగతిశీల వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు సాయాగౌడ్ డిమాండ్ చేశారు. ముల్లంగి(ఐ) గ్రామాన్ని బుధవారం సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీ నాయకులతో కలిసి ఆయన సందర్శించారు. ఇళ్ల నిర్మాణ పనులకు భూమిపూజ చేసిన శిలాఫలకం వద్ద నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రూ.1.57 కోట్ల అంచనా వ్యయంతో 2021లో రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్, గ్రామంలో డబుల్ బెడ్‌రూం ఇళ్ల నిర్మాణానికి భూమి పూజ చేసి రెండేళ్లు గడిచినా పనులు మొదలు పెట్టకపోవడం శోచనీయమన్నారు. ఇప్పటికైనా కలెక్టర్ నారాయణ రెడ్డి, ముల్లంగి(ఐ) గ్రామాన్ని సందర్శించి అర్హులైన పేదలందరికీ డబుల్ బెడ్‌రూం ఇళ్లను నిర్మించి ఇవ్వాలని కోరారు. అలాగే సొంత స్థలాలు ఉన్న పేదలకు ఇళ్లు నిర్మించుకునేందుకు డబ్బులు మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు.

సమష్టి పోరాటంతో జిల్లా సాధించుకుందాం



బోధన్: సమష్టి పోరాటంతో బోధన్ కేంద్రంగా ప్రత్యేక జిల్లా సాధించుకుందామని పలువురు న్యాయవాదులన్నారు. బోధన్ జిల్లా కోసం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కోర్టు ఎదుట చేపట్టిన రిలే నిరాహార దీక్షలు బుధవారం నాటికి 38వ రోజుకు చేరాయి. దీక్షలో ప్రైవేట్ ఎలక్ట్రికల్ గవర్నమెంట్ లైసెన్స్‌డ్ వైర్ మెన్స్ అసోసియేషన్ డివిజన్ కమిటీ ప్రతినిధులు, సభ్యులు కూర్చున్నా రు. బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ గంగారెడ్డి పాల్గొన్నారు.

సెలవులు ఉపాధ్యాయుల ప్రాథమిక హక్కు

భీమ్‌గల్: ఉపాధ్యాయులకు సెలవులు మంజూరు చేయొద్దంటూ జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గప్రసాద్ ఇచ్చిన ఉత్తర్వులను ఖండిస్తున్నట్లు టీఎస్ యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి మల్కా జనార్దన్ బుధవారం తెలిపారు. ఈ సందర్భంగా మల్కా జనార్దన్ మాట్లాడుతూ.. ప్రమోషన్ల పేరుతో ఉపాధ్యాయులకు సెలవులు ఇవ్వరాదని ఉత్తర్వులు జారీ చేయడం సరికాదన్నారు. వ్యక్తిగత అవసరాలు, ఆరోగ్య సమస్యలు ఉన్న సమయంలో సెలవులు వాడుకోవాల్సిన అవసరం ఉంటుందని తెలిపారు. ఉత్తర్వులు ఉపసంహరించుకోకపోతే ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

పీఆర్టీయూ కార్యవర్గం

పెర్కిట్(ఆర్మూర్): ఆలూర్ మండల పీఆర్టీయూ నూతన కార్యవర్గాన్ని బుధవారం ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు మోహన్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు. ఆలూర్ మండల అధ్యక్షుడిగా భోజన్న, ప్రధాన కార్యదర్శిగా అశ్ఫాక్ అహ్మద్, గౌరవ అధ్యక్షుడిగా డీకే జగదీశ్వర్, ఉపాధ్యక్షుడిగా వెంకటేశ్వర్ రావు, అసోసియేట్ అధ్యక్షుడిగా కిషన్, మహిళ కార్యదర్శిగా సుమలత ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. నూతన కార్యవర్గాన్ని మోహన్ రెడ్డి ఘనంగా సన్మానించారు. పీఆర్టీయూ డివిజన్ ఇన్‌చార్జి లక్ష్మణ్ పటేల్, ఆర్మూర్ మండల అధ్యక్షుడు ఇట్టం గోపాల్, హెచ్ఎంలు కుంట శ్రీనివాస్ రెడ్డి, హరిత పాల్గొన్నారు.

ఇచ్చిన హామీలు నెరవేర్చాలని వినతి



నవీపేట(బోధన్): సీఎం కేసీఆర్ ఇచ్చిన హామీని అమలు చేయాలని కోరుతూ మధ్యాహ్న భోజన యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి ఆ ధ్వర్యంలో ఏజెన్సీ కార్మికులు బుధవారం నవీ పేట తహసీల్దార్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని అందించారు. యూనియన్ జిల్లా అధ్యక్షురాలు చామంతి లక్ష్మి మాట్లాడుతూ.. సీఎం నిండు అసెంబ్లీలో మధ్యాహ్న భోజన కార్మికులకు రూ.3 వేల వేతనం ఇస్తానని హామీ ఇచ్చి ఏడాది గడు స్తున్నా ఇప్పటికి అమలు చేయకపోవడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. చిన్నపిల్లలకు అందించే పౌష్టికాహారం కోడిగుడ్లను నేరుగా ప్రభుత్వమే సరఫరా చేయాలన్నారు. ఉద్యోగ భద్రత కల్పించాలని, ప్రమాద బీమా, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని ఆమె కోరారు.

ప్రజాస్వామ్య దేశంలో ఓటు కీలకం



మాట్లాడుతున్న తెయూ వీసీ రవీందర్



ఓటరు ప్రతిజ్ఞ చేస్తున్న అధ్యాపకులు, విద్యార్థులు

తెయూ(డిచ్‌పల్లి): ప్రజాస్వామ్య దేశంలో ఓటు హక్కు కీలకమని, సరైన అభ్యర్థిని ఎమ్మెల్యేగా, ఎంపీగా ఎన్నుకునే అవకాశం ఓటు హక్కు కల్పిస్తుందని తెలంగాణ యూనివర్సిటీ వీసీ రవీందర్ అన్నారు. బుధవారం తెయూ కంప్యూటర్ సైన్స్ కాలేజ్ భవనంలో ఎన్ఎస్ఎస్ యూనిట్ –1, 2, 3, 4 సంయుక్త ఆధ్వర్యంలో 13వ జాతీయ ఓటర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన వీసీ మాట్లాడుతూ.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను ఎన్నుకోవడంలో యువత పాత్ర ఎంతో కీలకమన్నారు. 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరు ఓటు హక్కు పొందాలన్నారు.

అనంతరం విద్యార్థులు, అధ్యాపకులతో కలిసి ఓటరు ప్రతిజ్ఞ చేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ సీహెచ్‌ఆరతి, ఎన్ఎస్ఎస్ కో–ఆర్డినేటర్ రవీందర్ రెడ్డి, ప్రొగ్రాం ఆఫీసర్స్ మహేందర్, స్వప్న, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

జాతీయ ఓటర్ల దినోత్సవం



ఓటరు దినోత్సవంలో ఘన్‌పూర్ పాఠశాల విద్యార్థులు, తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో గోపిబాబు



సిరికొండలో ప్రతిజ్ఞ చేయిస్తున్న తహసీల్దార్ గఫార్

డిచ్‌పల్లి/సిరికొండ/ధర్పల్లి : జాతీయ ఓటరు దినోత్సవాన్ని రూరల్ నియోజకవర్గ పరిధిలో బుధవారం ఘనంగా నిర్వహించారు. గ్రామాలు, పట్టణాలలో విద్యార్థులతో కలిసి ప్రజాప్రతినిధులు ర్యాలీలు నిర్వహించారు. ఓటు హక్కుకు ఉన్న ప్రాధాన్యతను వివరిస్తూ నినాదాలు చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు కీలకమని, ప్రతి ఒక్కరూ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని, ఎన్నికల్లో సరైన అభ్యర్థిని నాయకుడిగా ఎన్నుకోవాలని కోరారు. గ్రామ పంచాయతీల వద్ద ప్రజలతో కలిసి ప్రతిజ్ఞ నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో ప్రజాప్రతినిధులు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.



డిచ్‌పల్లిలో భారీ జాతీయ జెండాతో ర్యాలీ



ధర్పల్లిలో.. అధికారులు



సత్యశోధక్ పాఠశాలలో ..విద్యార్థులు, ఉపాధ్యాయులు

సమాచారం..

నేడు అంబేడ్కర్ విగ్రహావిష్కరణ

మోపాల్(నిజామాబాద్‌రూరల్): నగరశివారులోని బోర్గాం(పి)లోగల 5వ డివిజన్‌లో పాత గ్రామపంచాయతీ కార్యాలయం వద్ద భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమం గురువారం సాయంత్రం 4 గంటలకు నిర్వహిస్తున్నట్లు నాయకులు చిలుక శ్రీనివాస్ బుధవారం తెలిపారు. కార్యక్రమానికి ఆర్టీసీ చైర్మన్, రూరల్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ హాజరుకానున్నారని పేర్కొన్నారు.

బంగారం ధరలు (10గ్రాములు)

24 క్యారెట్స్	58,200	వెండి (కిలో)	71,000
22 క్యారెట్స్	53,650	- నిజామాబాద్ బిజినెస్	

కూరగాయల ధరలు (రూ.)


	హోల్‌సేల్	రిటైల్		హోల్‌సేల్	రిటైల్
టమాట	6	10	క్యాప్సికం	30	50
బెండకాయ	60	80	గాజరుగడ్డ	25	40
బీరకాయ	50	70	పచ్చిమిర్చి	35	50
దొండకాయ	30	50	దోసకాయ	30	50
బీర్నిసుకాయ	30	50	ఆలుగడ్డ	20	40
కాకరకాయ	30	50	గోబిగడ్డ	10	20
వంకాయ	35	50	గోబిపువ్వు	15	30
పాలకూర	20	40	బీట్‌రూట్	20	40
మెంతికూర	40	60	గోరు చిక్కుడు	40	60
కొత్తిమీర	30	50	చిక్కుడుకాయ	40	60
పుదీనా	40	60			

- ఇందూరు

మాంసం ధరలు (రూ.)

చికెన్	ధరలు (కిలోకు)	డ్రెస్సిడ్	220
		లైవ్	180
స్కిన్‌లెస్	260	మటన్	750

వెండితెర తెలుగు/హిందీ/ఇంగ్లీష్



ఉషా ప్రసాద్ మల్టీప్లెక్స్ (గీతా ఏషియన్)

స్క్రీన్-1 – వీరసింహారెడ్డి – 1.20, 4.25, 7.30, 10.40
స్క్రీన్-2 – వారసుడు – 1.10, 7.30, 10.40
స్క్రీన్-3 – వాల్తేరు వీరయ్య – 10.30, 1.30, 4.30, 7.30, 10.30

పీవీఆర్ మల్టీప్లెక్స్ (వేణు మాల్)

స్క్రీన్-1 – వాల్తేరు వీరయ్య – 12.30, 3.10, 7.10, 10.30
స్క్రీన్-2 – వాల్తేరు వీరయ్య – 11.10, 9.30; వారసుడు – 2.30, 6.00
స్క్రీన్-3 – వారసుడు – 11.40; వీరసింహారెడ్డి – 3.10, 6.40, 10.10
స్క్రీన్-4 – వీరసింహారెడ్డి – 11.10; పుష్ ఇన్ బో(ఇంగ్లీష్) – 2.40, 8.25; వాల్తేరు వీరయ్య – 5.05; వారసుడు – 10.50

దేవి	వీరసింహారెడ్డి
నటరాజ్	ధమాకా
లలితామహల్	వాల్తేరు వీరయ్య
శ్రీదేవి	50–50 (హిందీ)
విజయ్	వారసుడు